www.prajasakti.com

# ప్రజాశక్తి

శనివారం 5 జూలై 2025

5

ఏలూరు



## సమస్యలు పరిష్కరించాలి

### ఆర్టిసి కార్మికుల ఆందోళన



నినదిస్తున్న కార్మికులు

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

నూజివీడు పట్టణంలోని ఎపిఎస్ఆర్టిసి డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు రంగు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పాలకులు కార్మికులను నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆర్థికపరమైన అంశాలు సమస్యలుగా మిగిలి ఉన్నాయన్నారు. నేటి పాలకులు న్యాయమైన తమ 40 సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. సమస్యల పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# కబళిస్తున్న కాలుష్యం..!

**ఆక్వా కంపెనీల్లో నిబంధనలు బేఖాతరు**
**చోద్యం చూస్తున్న కాలుష్య నియంత్రణ అధికారులు**
**కానరాని ట్రీట్‌మెంట్ ప్లాంట్లు**
**విపరీతమైన దుర్వాసనతో తల్లడిల్లుతున్న జనం**



సీసలిలో అలంకారప్రాయంగా ట్రీట్ మెంట్ ప్లాంట్

**ప్రజాశక్తి - కాళ్ల**

జిల్లాలో పలు ఆక్వా ప్రాసెసింగ్ కంపెనీలు పర్యావరణానికి తీవ్ర విఘాతాన్ని కల్గిస్తున్నాయి. కాలుష్య వ్యర్థాలు యథేచ్ఛగా విడుదల చేయడంతో విపరీతమైన దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఇటు అధికారులుగాని, అటు యాజమాన్యాలుగాని పట్టించుకున్న దాఖలాల్లేవు. దీనికి నిదర్శనం సీసలి, పెదఅమిరం గ్రామాల పరిసరాల్లో. పెదఅమిరం-సీసలి ప్రధాన రహదారి వెంబడి మురుగు కాల్వ నిండా కలుషిత వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ముక్కుమూసుకుని వెళ్లక తప్పని పరిస్థితి. కాలువల్లోకి నేరుగా వ్యర్థ జలాలను విడిచిపెడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరికలను సైతం ఆక్వా పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. రొయ్యల ప్రాసెసింగ్ పరిశ్రమల నుంచి కలుషిత వ్యర్థాలను నేరుగా కాలువల్లోకి విడిచిపెడుతుండటంతో అనేక సమస్యలు ముసురుకుంటున్నాయి.

రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలను స్థాపించేందుకు అనేక నిబంధనలు ఉన్నాయి. రొయ్యలను ప్రాసెసింగ్ చేసే క్వాంటిటీని బట్టి సంబంధిత కంపెనీలు తప్పనిసరిగా 'ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' ఏర్పాటు చేసుకోవాలి. రొయ్యలను ప్రాసెసింగ్ చేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను కాలువల్లోగాని, రోడ్లపైగాని, మురుగు డ్రెయిన్లలోకిగాని వదలరాదు. ప్రాసెసింగ్ తర్వాత వచ్చే వ్యర్థాలను ఈ ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి వదిలి, వాటిని రీసైక్లింగ్ చేసిన తర్వాత వచ్చిన నీటిని కంపెనీకి సంబంధించిన వ్యవసాయ భూమి అవసరాలకు ఉపయోగించుకోవాలి. అయితే ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు ఈ నిబంధనలేవీ పాటించడం లేదు. ఇలా పైన ఏర్పాట్లు చేసుకోవడంతోపాటు కంపెనీ ఆధీనంలో ఉన్న



పెదఅమిరంలో మురుగు కాలువలో పరిశ్రమల కలుషిత వ్యర్థాలు

మూడెకరాల వ్యవసాయ భూమికి అనుసంధానమై ఉండాలి. ఇవేమీ లేకుండానే నిర్వాహకులు పరిశ్రమలు నడిపేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కంపెనీల్లో ట్రీట్‌మెంట్



సీసలిలో పరిశ్రమలోని నీటిని కాలువలోకి వదిలేస్తున్న దృశ్యం

ప్లాంట్లు అలంకారప్రాయంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రొయ్యలను ప్రాసెసింగ్ చేసిన తర్వాత విడుదలయ్యే వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో శుద్ధి చేయకుండానే సమీపంలోని డ్రెయిన్లలోకి నిర్భయంగా వదిలేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పర్యవేక్షించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఈ అనధికార ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లపై దృష్టి సారించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


**నోటీసులిచ్చాం..**

**శీలా ప్రసన్న, డ్రెయినేజీ శాఖ ఎఇ**

మురుగు కాల్వల్లోకి, బోదెల్లోకి నేరుగా వ్యర్థ జలాలను వదులుతున్న పరిశ్రమలకు నోటీసులిచ్చాం. పరిశ్రమల కాలుష్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లెటర్ రాశాం. నీటి సంఘాల ఆధ్వర్యంలో కాల్వల ప్రక్షాళన పనులు చేపట్టాల్సి ఉంది. ఈ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతాం.

# పేదల పోరుతో దిగొచ్చిన అధికార గణం

**పట్టాలిచ్చేందుకు తహశీల్దార్ అంగీకారం**
**దీక్ష విరమించిన ఇళ్ల స్థలాల లబ్ధిదారులు**



బాధిత పేదలతో మాట్లాడుతున్న తహశీల్దార్

**ప్రజాశక్తి - మండవల్లి**

తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలు మెరక చేసి ఒరిజినల్ పట్టాలను పంపిణీ చేయాలని కోరుతూ ఇళ్ల స్థలాల లబ్ధిదారులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఫలితాలనిచ్చాయి. ఇళ్ల స్థలాల లబ్ధిదారులు, సిపిఎం నేతలతో తహశీల్దార్ నిర్వహించిన చర్చల్లో ఒరిజినల్ పట్టాలను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. ఒరిజినల్ పట్టాల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో పట్టాల పంపిణీకి సిద్ధం చేస్తామని తహశీల్దార్ తెలిపారు. దీంతో లబ్ధిదారులు రిలే నిరాహార దీక్షలను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో కామన్‌సైట్‌గా పేర్కొన్న స్థలంలో పోలీస్ స్టేషన్ నిర్మాణం నిలుపుదల చేయాలని, లబ్ధిదారులకు ఒరిజినల్ పట్టాలను పంపిణీ చేసి భూములు మెరక చేసి ఇల్లు నిర్మించుకునేలా చేయాలని కోరుతూ తరుగుమూల ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి ర్యాలీగా రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. తహశీల్దార్ బయటకు రావాలని, ఒరిజినల్ పట్టాలను పంపిణీ చేయాలని, భూమి మెరక చేసి ఇల్లు నిర్మించుకునేలా చేయాలని, కామన్‌సైట్‌లో పోలీసు స్టేషన్ నిర్మించొద్దని నినదించారు. దీంతో స్పందించిన తహశీల్దార్ గోపాల్ లబ్ధిదారులతో, సిపిఎం నాయకులతో చర్చలు జరిపారు. 20 ఏళ్ల క్రితం లబ్ధిదారులను గుర్తించి పట్టాలు పంపిణీ చేశారని, వెంటనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని పట్టాలను గృహనిర్మాణ శాఖకు అప్పగించారని తహశీల్దార్‌కు చెప్పారు. నాటి నుంచి పట్టాలన్నా ఇవ్వండి, మెరకైనా చేసి ఇల్లు నిర్మించండి అని ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019కు ముందు ఇళ్ల స్థలాల్లో లబ్ధిదారుల పరిస్థితిని బట్టి రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు వెచ్చించి రేకులు, తాటాకులతో ఇల్లు నిర్మించుకుని ఉంటున్నారని తెలిపారు. అయితే అప్పటి కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మెరక చేయిస్తానని, రహదారులు ఏర్పాటు చేసి, విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని, నివాసాలను తొలగించాలని కోరడంతో ఇళ్లను తొలగించామని, అయితే ఎంఎల్ఎ హామీలేవీ కార్యాచరణకు నోచుకోకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని లబ్ధిదారులు వాపోయారు. ఇప్పుడు పేదల ఇళ్ల స్థలాల కామన్ సైట్‌లో పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించడంతో ఇక తమ స్థలాలు దక్కవేమోనని ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధం లేకుండా, రీవెరిఫికేషన్ లేకుండా ఒరిజినల్ పట్టాలను పంపిణీ చేయాలని, మృతి చెందిన లబ్ధిదారుల కుటుంబీకులకు పట్టాలను పంపిణీ చేయాలని లబ్ధిదారులు తహశీల్దార్‌ను కోరారు. దీనిపై తహశీల్దార్ గోపాల్ స్పందిస్తూ ఒరిజినల్ పట్టాలు పంపిణీ చేస్తానని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో ఒరిజినల్ పట్టాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీంతో శ్రీనివాస్ లబ్ధిదారుల తరపున తహశీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దీక్షలను విరమిస్తున్నట్లు లబ్ధిదారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పద్మ, సింహాచలం, అలివేలు మంగమ్మ, జస్వింత కమల, మహాలక్ష్మి, జ్ఞానానందం, మరియమ్మ, కనకదుర్గ, చింతామణి, నాగలక్ష్మి, మరో 25 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అల్లూరి, అల్లూరు స్ఫూర్తితో కార్పొరేట్ దోపిడీ వ్యతిరేక పోరు



సిపిఎం జిల్లా కార్యాలయంలో..

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

స్వాతంత్ర సమరయోధులు, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి, జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు అల్లూరు సత్యనారాయణ 11వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సిపిఎం జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు పూలమాల వేయగా, అల్లూరు సత్యనారాయణ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు పి.ఆదిశేషు పూలమాల వేశారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ జులై 4వ తేదీకి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఈ రోజు అనేకమంది ప్రముఖుల వర్ధంతులు, జయంతులు ఉన్నాయని తెలిపారు. మన్యం విప్లవ వీరుడు అల్లూరి 128వ జయంతి, భౌతిక రసాయన శాస్త్రవేత్త మేడం క్యూరీ 89వ వర్ధంతి, స్వామి వివేకానంద 123వ వర్ధంతి, మువ్వన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య 61వ వర్ధంతి, తెలంగాణ సాయుధ పోరాటంలో మొదటి అమరవీరుడు దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమ్యూనిస్టు, కార్మిక వర్గ నేత, కీర్తిశేషులు అల్లూరు సత్యనారాయణ 11వ వర్ధంతి జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం జరిగే పోరాటాల్లో వీరంతా తమ తమ పాత్ర పోషించారన్నారు. తత్వశాస్త్రంలోనూ, పోరాటాల్లోను, విప్లవ కార్యక్రమాల్లోనూ, సైన్స్ అభివృద్ధిలోనూ, స్వాతంత్ర పోరాటాల్లోను, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడటంలోను వీరందరి పాత్ర ఉందన్నారు. మనం వారిని ఆదర్శంగా తీసుకుని ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం, యుద్ధోన్మాదం, కార్పొరేట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా ఎర్రజెండా పట్టుకుని పోరాటాలకు సిద్ధం కావాలని, అదే మనం ఈ మహనీయులకు ఇచ్చే ఘన నివాళి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎన్.ప్రసాద్, కోటేశ్వరరావు, త్రినాధ్, ఎం.సత్యం తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా జయంతి, వర్ధంతి సభలు**

**సిఐటియు జిల్లా కార్యాలయంలో**

సిఐటియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అల్లూరు సత్యనారాయణ వర్ధంతి స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సిఐటియును అభివృద్ధి చేసేందుకు అల్లూరు సత్యనారాయణ ఎంతో కృషి చేశారన్నారు. జిల్లాలో వేలాది మంది కార్మికులకు సంఘాలు ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించారని, అల్లూరు సత్యనారాయణ స్ఫూర్తితో జిల్లాలో మరిన్ని కార్మిక పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.రవికిషోర్, కె.విజయలక్ష్మి, వివిఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు, మొహిద్దీన్, రాంబాబు, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు జిల్లా కార్యాలయంలో..

# అల్లూరి ఒక మహోన్నత శక్తి

## నివాళులర్పించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

**ప్రజాశక్తి - ఏలూరు**

స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కలెక్టర్ కె.వెట్రి సెల్వి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అల్లూరి జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశం కోసం, ప్రజల కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు ప్రజలకు సేవలందించాలన్నారు. ప్రజల హక్కులు, స్వాతంత్రం కోసం అలుపెరగని కృషి చేసిన స్వాతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి ధైర్యం, త్యాగనిరతి, నిరాడంబరత తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. త్యాగశీలత, దేశం పట్ల గౌరవం, ఐక్యత, సమగ్రతల స్ఫూర్తిని ఇటువంటి మహనీయుల నుంచి యువత అందిపుచ్చుకుని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి ఎన్ఎస్.కృపావరం, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, కలెక్టరేట్ వివిధ విభాగాల్లోని సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు

**పేదరికాన్ని పారదోలేలా పి-4 అమలు - మంత్రి కొలుసు పార్థసారధి**



కరపత్రాలు పంచుతున్న మంత్రి పార్థసారధి

**ప్రజాశక్తి - ముసునూరు**

సుపరిపాలన తొలి అడుగు-ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వేల్పుచర్ల, బలివే గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులతో కలిసి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుతున్న పథకాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. గొర్రె కాపరులు గొర్రెపిల్లను బహుమతిగా ఇవ్వగా గొర్రెపిల్లను ముద్దాడి భుజాలు మీద పెట్టుకుని మంత్రి కొలుసు పార్థసారథి అందరినీ ఆశ్చర్యపర్చారు. ప్రభుత్వం ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు అందజేసి, వాల్‌పోస్టర్‌ను మంత్రే స్వయంగా అతికించారు. పలువురు రోడ్ల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆరు రోడ్ల నిర్మాణానికి మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ గత ప్రభుత్వం బటన్ నొక్కడంపైనే దృష్టి పెట్టిందని, రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచే ఆలోచన చేయలేదని అన్నారు. రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు యువతీ, యువకులకు అందజేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, నేతలు గరికిముక్కు నాని, తుమ్మల నాగేశ్వరరావు, మానం వంశీ, ఘంటేశ్వరరావు, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర శ్రీనివాసరావు, మేదరమెట్ల సురేంద్ర, తహశీల్దార్ కె.వెంకటరమణ, ఎంపిడిఒ బి.ఎ.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయండి

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా**



నినదిస్తున్న విద్యార్థులు, నేతలు

**ప్రజాశక్తి - కుక్కునూరు**

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శుక్రవారం ర్యాలీ, అనంతరం ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎంఇఒ కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పోతురాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్య అందని ద్రాక్షగా మారిందని, బదిలీల తర్వాత ఖాళీలను భర్తీ చేయకపోవడం ఈ సమస్యకు కారణమని తెలిపారు. మండలంలో 32 ఎంపిపిఎస్, 11 ఎంపియుపిఎస్, మూడు జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలల్లో మూడు వేలకుపైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీ వల్ల పేద విద్యార్థులకు విద్యాబోధన సాగడం లేదన్నారు. స్థానిక నిరుద్యోగులను వాలంటీర్లుగా నియమించి, డిఎస్‌సి కౌన్సెలింగ్ ద్వారా శాశ్వత నియామకాలు చేపట్టాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకుడు యర్నం సాయికిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.నాగేంద్రరావు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వి.లక్ష్మణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

**ప్రజాశక్తి - దెందులూరు**

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దుకు ఈనెల 9వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు ఐక్యంగా వేలాదిగా పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం దెందులూరులో జరిగిన సిఐటియు మండల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి కె.కామేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వాతంత్రానికి ముందు నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికులను బానిసలుగా మారుస్తోందన్నారు. 8 గంటల పని హక్కును రద్దు చేశారని, కనీస వేతన చట్టాన్ని రద్దు చేశారని, కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కుని రద్దు చేశారని, ఇలాంటి నిర్ణయాలతో కార్మికులు మళ్లీ బానిసత్వంలోకి నెట్టబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు ఈ సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మాజీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసింహారావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నేతలు లక్ష్మి, విజయ దుర్గ పాల్గొన్నారు.

**చింతలపూడి :** ఈనెల 9న జరుగుతున్నటువంటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక, ఉద్యోగ, గ్రామీణ, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ పిలుపునిచ్చారు. మండలంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిఐటియు జనరల్ బాడీ సమావేశం సిఐటియు మండల అధ్యక్షుడు నత్త వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరించి వేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పోరాడి సాధించుకున్నటువంటి 8 గంటల పని విధానాన్ని నిర్వీర్యం చేసిందని, రాత్రుల సమయాలలో మహిళలచే పని ప్రదేశాలలో పని చేయించుకొన వచ్చుననే నిబంధనలు మార్పు చేయడం అటు కేంద్రం, ఇటు కూటమి ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగ వర్గాలను మోసం చేయటమేనని అన్నారు. అనంతరం రైతు సంఘం బాధ్యులు పి.పాండురంగారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశ, మున్సిపల్, మెప్మా, బిల్డింగ్ రంగం కార్మికులు పాల్గొన్నారు.

# దళితులపై దౌర్జన్యం తగదు

**ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు జగదీష్**





నినదిస్తున్న ప్రజలు

**ప్రజాశక్తి - మండవల్లి**

దళితుల భూములను ఆక్రమించి సాగు చేసుకుంటూ దళితులపై దౌర్జన్యానికి దిగడం సరైన పద్ధతి కాదని ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు జగదీష్ స్పష్టం చేశారు. మా భూములను ఖాళీ చేసి వెళ్లిపోవాలని కోరుతూ సింగనపూడి దళితులు నిర్వహిస్తున్న భూస్వాధీన ఉద్యమం శుక్రవారం కూడా కొనసాగింది. ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు చెరువుగట్టుపైన గడ్డిని కోసుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీజులు ఇస్తామని నమ్మబలికి పెత్తందారి మాడపాటి కృష్ణప్రసాద్ దళితులను ఏళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ భూములు మావి అని అధికారులు ధృవీకరిస్తున్నప్పటికీ కృష్ణప్రసాద్ రాజకీయ అండతో దళితులపై దౌర్జన్యానికి దిగడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా లీజు దారుడు స్పందించి పూర్తిస్థాయిలో లీజులు చెల్లించి చెరువు ఖాళీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మా భూములలో నుంచి వెళ్లిపోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్, పక్కీర దావీదు, జేమ్స్ బుడ్డ ఆనందరావు, పక్కిరి పౌలు శివ, బొడ్డు చింతయ్య, మెరుగు సునీత, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# సూర్యావతి స్ఫూర్తితో పోరాడాలి : ఐద్వా

**ఏలూరు అర్బన్ :** మానికొండ సూర్యావతిని ఆదర్శంగా తీసుకుని మహిళల హక్కులపై పోరాటాలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి తెలిపారు. ఐద్వా ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు మానికొండ సూర్యావతి 32వ వర్ధంతి సభ స్థానిక గన్‌బజార్‌లోని గంగానమ్మగుడి వద్ద శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి అధ్యక్షత వహించారు. ఈ సభలో సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ మానికొండ సూర్యావతి కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఇందుపల్లి గ్రామంలో సంపన్న కుటుంబంలో జన్మించారని, నమ్రత, క్రమశిక్షణ ఆమె సహజ లక్షణాలన్నారు. ఆనాటి సాంఘిక పరిస్థితుల్లో స్వాతంత్రోద్యమంలో పాల్గొంటూనే సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమాల్ని నిర్వహించారని తెలిపారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మహిళల సమస్యల కోసం, హక్కుల కోసం పోరాటాలు నిర్వహించడమే ఆమెకు ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, వరలక్ష్మి, మేదర పాప, కటారి సుల్తానా, కె.భవాని, ఎం.నాగలక్ష్మి, బి.శ్రావణి పాల్గొన్నారు.

## పాఠశాలలో జెడ్‌పి చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

**ప్రజాశక్తి - భీమడోలు రూరల్**

మండలంలోని గుండుగొలనులో ఉన్న జెడ్‌పి హైస్కూల్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, బోధనా ప్రమాణాలు, ప్రతి శుక్రవారం నిర్వహించే ఆరోగ్య శిబిరాలపై నమోదు చేసే రిజిస్టర్లు తదితర అంశాలను పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించి వారికి అందుతున్న సౌకర్యాలు, ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. అధికారులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## అన్యాక్రాంతమైన భూములు పేదలకు పంచాలి : వ్యకాస

**ఆగిరిపల్లి:** మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను రెవెన్యూశాఖా అధికారులు స్వాధీనపర్చుకొని అర్హులైన పేదలకు పంచాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆగిరిపల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో చినాగిరిపల్లి భూ పోరాట కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పెత్తందార్ల స్వాధీనంలో వున్న పేదల భూముల కోసం గత 30 సంవత్సరాలుగా చినాగిరిపల్లి దళితులు పోరాడుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూన్నారన్నారు. ఇప్పటికైనా మండలంలోని చినాగిరిపల్లి, తోటపల్లి, వట్టిగుడిపాడు, సూరవరం, అడవినెక్కలం తదితర గ్రామాల్లోని వేలాది ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు భూ స్వాముల కనుసన్నల్లో వున్నాయని ఆ భూములను ప్రభుత్వం స్వాధీన పర్చుకొని పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యకాస జిల్లా నాయకులు సత్తు కోటేశ్వరరావు, భూపోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అక్కరకురాని రేషన్ బియ్యం సరఫరా..

## ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

## లబ్ధిదారుల ఆగ్రహం

ప్రజాశక్తి - ముదినేపల్లి

వికలాంగులకు, 65 ఏండ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దకే బియ్యం సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిబంధనలు స్థానిక రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వం వాహనాల ద్వారా ఇంటి వద్దకే బియ్యం సరఫరా చేయగా, టిడిపి కూటమి ప్రభుత్వం మార్పుచేసి పాత రేషన్ షాపుల డీలర్లకు బాధ్యత అప్పగించింది. 65 ఏండ్లు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది ద్వారా డీలర్ ఇండ్ల వద్దకు వెళ్లి అందజేయాల్సి ఉంది. దీనిపై స్థానిక విఆర్ఓ పర్యవేక్షించాల్సి ఉంది. మండలంలో కోడూరు, బొమ్మినంపాడు చాలా గ్రామాల్లో ఈ పంపిణీ సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ పథకం ప్రభుత్వ విధానాల్లో లక్ష్యం నెరవేరాలంటే మండలంలోని రేషన్ డీలర్లు, సచివాలయ సిబ్బంది, విఆర్ఓలకు తహశీల్దార్ సమక్షంలో సమావేశం నిర్వహించి, సమీక్షించి తగు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## పోరాట యోధుడు అల్లూరు సత్యనారాయణ

### వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అనేక రంగాలలో పనిచేస్తున్న కార్మికుల భద్రత, ఆర్థిక, తదితర విషయాలలో అండగా నిలిచిన పోరాట యోధుడు అల్లూరు సత్యనారాయణ స్ఫూర్తితో పనిచేయాలని సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ ఉమ్మడి జిల్లా నిర్మాత అల్లూరు సత్యనారాయణ 11వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు వి.గోపి, ఎస్కె.మాభూ, డి.ఆశీర్వాదం, నానీ, స్టాలిన్ పాల్గొన్నారు.

**నిడమర్రు** : ఉమ్మడి రాష్ట్రాల కార్మిక ఉద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమణారావు అన్నారు. కార్మిక ఉద్యమ నిర్మాత అల్లూరుకి ఘన నివాళి అర్పించారు. భువనపల్లి గ్రామంలో కోన శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, లింగబరి లక్ష్మీనారాయణ, పద్మావతి, శ్రావణి, శాంతి, భవాని పాల్గొని నివాళులర్పించారు.

## నాటు సారా అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు

### ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య

**చింతలపూడి** : నాటు సారాయి అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య అన్నారు. నాగిరెడ్డిగూడెం గ్రామంలో నాటు సారా తయారీ, అక్రమ విక్రయాలపై కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. చింతలపూడి సర్కిల్స్ సిబ్బంది తెల్లవారుజామున భారీ స్థాయిలో సుమారు 460 ఇళ్లల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేదన్నారు. చట్టాలను అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి హానిచేసే నాటుసారా తయారీ కేంద్రం సమాచారం లేదా అమ్మకాల కార్యకలాపాలుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కి, చింతలపూడి ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబర్ 9440796674కు వెంటనే తెలియజేయాలన్నారు. అట్టి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

## కుట్టు మిషన్లు ఇస్తామని మోసం

### ప్రయివేటు స్వచ్ఛంద సంస్థకు చెందిన మహిళపై ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుట్టు మిషన్ ట్రైనింగ్ ఇచ్చి, అనంతరం కుట్టు మిషన్లు ఇస్తామని నగదు తీసుకొని ఓ ప్రయివేటు స్వచ్ఛంద సంస్థకు చెందిన మహిళ మోసం చేసిందని బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వంకవారిగూడెం పంచాయతీ వాడపల్లి పునరావాస కాలానికి చెందిన 50 మందికిపైగా మహిళలను రాజమండ్రికి చెందిన ఓ ప్రయివేటు స్వచ్ఛంద సంస్థకు చెందిన సుమలత అనే మహిళ గత కొన్ని నెలల క్రితం మహిళలకు కుట్టు మిషన్ ట్రైనింగ్ ఇచ్చి అనంతరం కుట్టు మిషన్లు ఇస్తామని రూ.4,500 చొప్పున నగదు తీసుకొన్నట్లు చెబుతున్నారు. అనంతరం మరలా వచ్చి మిషన్ బాడీ ఇచ్చి మిషన్లు ఇవ్వకుండా వెళ్లిపోయిందని అంటున్నారు. అనంతరం మరలా రాకపోవడంతో బాధితులు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్పందించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో తెల్లం రాజమ్మ, మడకం లక్ష్మీ, కోర్స భాగ్యలక్ష్మి, రమాదేవి ఉన్నారు.

## ఇరువురు ఘర్షణ : పలువురికి గాయాలు

**ముదినేపల్లి** : ఇంటి ముందు మురుగు డ్రెయిన్ తవ్వకంపై ఇరుతరగతుల మధ్య ఏర్పడ్డ ఘర్షణ దాడికి దారి తీసింది. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దేవపూడికి చెందిన కట్టా నాగరాజు ఇంటి ముందు ఎదురుగా నివాసమున్న గూడవల్లి సుబ్బయ్య, గూడవల్లి ముసలయ్య, గూడవల్లి యేసు, గూడవల్లి శ్రీను అనువార్లు ఇంట్లో వాడిన నీరు నాగరాజు ఇంటి ముందుకు వస్తున్నాయి. దీంతో గురువారం ఇరుతరగతులకు చెందిన వ్యక్తులు వారి వారి ఇంటి ముందు మురుగు నీరు పోయేందుకు డ్రెయిన్ తవ్వుకుంటున్నారు. ఈ క్రమంలో ఇరువురికి మాటా మాటా రావడంతో పైవ్యక్తులు నాగరాజు తల్లిదండ్రులను, తమ్ముడిని చేతులతో కొట్టగా, నాగరాజును కర్రతో తలపై కొట్టగా తల పగిలి గాయమైంది. గుడివాడ ఏరియా ఆసుపత్రి నుంచి శుక్రవారం వచ్చారు. ఫిర్యాదుపై ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వైద్యం వికటించి పాడి గేదె మృతి

**ముసునూరు** : పశువుల వైద్యులు లేక కింద స్థాయి ఉద్యోగులు చేసిన వైద్యం వికటించి గేదె మృతిచెందిన సంఘటన మండలకేంద్రమైన ముసునూరులో జరిగింది. స్థానిక గ్రామానికి చెందిన మానిక్యల రాంబాబు ముసునూరు గ్రామంలోని పశువుల ఆసుపత్రికి గేదె అనారోగ్యంగా వుందని గత వారం రోజుల నుంచి ఆసుపత్రికి తీసుకువెళ్లగా, ప్రభుత్వాసుపత్రిలో పర్మినెంట్ డాక్టర్ లేకపోవడం, ఇన్‌ఛార్జి డాక్టర్ కుడా గత వారం రోజుల నుండి రాకపోవడంతో కింద స్థాయి ఉద్యోగులు చేసిన వైద్యం వికటించి, సుమారు రూ.లక్ష విలువ గల ఎనిమిది నెలల సూడి గేదె చనిపోయింది. దీంతో ఆ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## సినీ ఫక్కీలో భారీ దొంగతనం

### 70 కాసుల బంగారు ఆభరణాలు, వజ్రాలు అపహరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రూరల్ పరిధిలో సినీ ఫక్కీలో భారీ దొంగతనం జరిగింది. ఏకంగా డాక్టర్ తన జీవితకాలం సంపాదించిన సొమ్మును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. 70 కాసుల బంగారు ఆభరణాలు, వజ్రాలు ఇలానేక వస్తువులు, నగదు ఇలా ఒకటేమిటి ఎన్నో ఏళ్ల నుంచి ఆ వృద్ధ డాక్టర్ సంపాదించి దాచుకున్న మొత్తం సొమ్మును ఒకేసారి కొల్లగొట్టుకుపోవడంతో ఆ డాక్టర్ లబోదిబోమంటున్నారు. సంబంధిత వివరాల ప్రకారం ఏలూరు రూరల్ పరిధిలో ఆశ్రమం ఆసుపత్రిలో దాసరి లోకనాథం సీనియర్ వైద్యులుగా పనిచేస్తున్నారు. ఆయన భార్యతో కలిసి ఆసుపత్రి క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో వ్యక్తిగత పనులపై లోకనాథం భార్య వేరొక ఊరికి వెళ్లింది. ఆయన యధావిధిగా ప్రతిరోజు విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. ఈ క్రమంలోనే ఆయన విధులకు హాజరై తిరిగి ఇంటికి వచ్చి చూసుకునేసరికి ఇంటి తాళం చెవులు కనబడలేదు. దీంతో ఆయనే స్వయంగా ఇంటి తాళాలను పగలగొట్టి లోపలికి వెళ్లారు. లోనికి వెళ్లి చూసేసరికి బీరువా పగలగొట్టి ఉండి దాంట్లో ఉండవలసిన 70 కాసుల బంగారు ఆభరణాలు, వజ్రాలు, ఇతర వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వేసిన తాళాలు వేసినట్లే ఉండి లోపల మాత్రం ఆభరణాలు గురికావడంతో ఆయన ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాటి విలువ దాదాపు రూ.16 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే పోయిన వజ్రాల విలువ దాదాపు కోటి రూపాయలు ఉంటుందని తోటి డాక్టర్లు గుసగుసలాడుతున్నారు. ఈ వజ్రాలు ఇంటి దొంగలే దొంగలించారా లేదా బయట నుంచి వచ్చిన దొంగల పనా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



# మందుబాబులకు అడ్డాగా బస్టాప్

## మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి - మండవల్లి



నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాప్

ఆర్‌టిసి బస్టాప్ మద్యంప్రియులకు, పోలీస్ కేసులో ఉన్న వాహనాలకు షెల్టర్‌గా మారింది. బస్టాప్‌లో మద్యం తాగుతున్న మందుబాబుల ఆగడాలకు అంతు లేకుండా పోతుంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా మద్యం తాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో మద్యంప్రియులకు నివాసయోగ్యంగా మారిపోయింది. మండవల్లి ప్రధాన సెంటర్‌లో ప్రయాణికులు వేచి ఉండే విధంగా వారి సౌకర్యార్థం సుమారు 40 సంవత్సరాల క్రితం బస్టాప్ నిర్మించారు. ప్రారంభం నుంచి కొన్ని సంవత్సరాల పాటు ప్రయాణికులు బస్టాప్‌ను వినియోగించుకున్నారు. ఆటోలు, బైక్‌ల వినియోగం పెరగడంతో ప్రయాణికులు బస్టాప్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి తగ్గింది. దీంతో బస్టాప్‌కు ప్రయాణికుల రాక తగ్గిపోయింది. పక్కనే పోలీస్ స్టేషన్ ఉండడంతో కేసుల నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వివిధ అవసరాలపై వచ్చిన వారు బస్టాప్ వినియోగించుకుని సేద తీరేవారు. ప్రస్తుతం జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా బస్టాప్ పల్లం అయిపోవడంతో పాటు పట్టు పట్టి చూస్తే తప్ప కనిపించని పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా చూసిన మద్యంప్రియులు బస్టాప్‌ను అడ్డాగా మార్చేసుకున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి బస్టాప్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

# ఘనంగా అల్లూరి 128వ జయంతి




జీలుగుమిల్లిలో..



ఏలూరు స్పోర్ట్స్: నివాళులర్పిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆనాడు స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి షేక్ మాబు సుభాని నాయకత్వంలో ఏలూరు రోడ్‌లో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు మాట్లాడుతూ ఆనాడు అల్లూరి సాగించిన పోరాటలను ఈరోజు దేశంలో, రాష్ట్రంలో విద్యా, ఉద్యోగాలు అందరికి కావాలని, అలాగే పెరుగుతున్న కుల, మత, భావాలకు వ్యతిరేకంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం అల్లూరికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నివాసప్రాంతలా సమాఖ్య నాయకులు వి.గోపి, ఆటో యూనియన్ నాయకులు డి. ఆశీర్వాదం, నానీ, స్టాలిన్ పాల్గొన్నారు.



ఏలూరు సిటీ : పూలమాల వేస్తున్న ఎంఎల్ఎ, మేయర్



టి.నరసాపురంలో..

**టి.నరసాపురం** : మండల కేంద్రమైన టి.నరసాపురంలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 108వ జయంతి వేడుకలు సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ, గుడెల్లి వెంకటరావులు సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామరాజు కేవలం ఒక తరగతికి చెందినవాడు కాదని, పేదలందరి పక్షాన, దేశ స్వాతంత్రం కోసం పోరాడి ప్రాణాలర్పించిన విప్లవ వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళీ, మడకం కుమారి, మడకం సుధారాణి, సూర్యరావు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..

**కొయ్యలగూడెం** : స్వాతంత్ర సమరయోధుడు, బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కన్నాపురంలో పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు అల్లూరి స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.

**ఉంగుటూరు** : మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతులను కైకరంలో నిర్వహించారు. ఆర్యవైశ్య రాష్ట్ర నాయకుడు కోన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కైకరంలో ఇరువురి విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోన హనుమాన్ బాబు, గుత్తికొండ రామ్ ప్రసాద్ చౌదరి, కొత్తపల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నారాయణపురంలో కొబ్బరితోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఆయన పోరాట విజయ గాథలను విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ వివరించారు. సీతారామరాజు జీవిత చరిత్రపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కూన కమల్ కుమార్, పంచాది సింహాచలం, టి.శ్రీధర్, ఫరీదా పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్** : నూజివీడు పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ డాక్టర్ ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌లో శుక్రవారం విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.నవీన లావణ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఒకటి, రెండు అధికారులు డాక్టర్ ఎస్కె.అన్వర్ భాషా, డాక్టర్ టి.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి** : ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజనుల హక్కుల కోసం అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమం లో మండల నాయకులు కొండలరావు, సీతారామయ్య, కారందుర్గ, గంగరాజు, శేషగిరిరావు, రమేష్ పాల్గొన్నారు.

**ఏలూరు సిటీ** : స్వాతంత్రకాంక్షతో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు చూపిన తెగువ, ధైర్యసాహసాలు అత్యంత ఆదర్శనీయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి కొనియాడారు. ఏలూరులో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. తొలుత స్థానిక జూట్‌మిల్ సెంటర్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి భారీ బైక్ ర్యాలీగా బయలుదేరి స్థానిక ఎఎస్ఆర్ స్టేడియం వద్దకు చేరుకున్నారు. అక్కడ నూతనంగా ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే స్టేడియంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, రిటైర్డ్ హెచ్ఎం జిల్లా వీరభద్రరావు, బోసురాజు, రామకృష్ణంరాజు, శ్రీరామ్‌రాజు, భగవాన్‌రాజు పాల్గొన్నారు.

**ఏలూరు** : ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తిలక్ నగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం సెంటర్లో సభ నిర్వహించారు. సభకు ముందు శర్వాణి పబ్లిక్ స్కూల్ నుంచి విద్యార్థులతో ప్రదర్శన చేశారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు, కె.జనని, శర్వాణి స్కూలు టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. సబ్బమదేవి హై స్కూల్‌లో ఇన్‌ఛార్జి హెచ్ఎం షడ్రక్ అధ్యక్షత కార్యక్రమం నిర్వహించారు.

**ఏలూరు స్పోర్ట్స్** : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఎంతోమంది వీరులకు ఆయన ఆదర్శప్రాయుడని, ఆయన ధైర్య సాహసాలు ఇప్పుడు ఎప్పుడూ కొనియాడదగినవని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, డిటిసి డిఎస్‌పి ప్రసాదరావు, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్ పాల్గొన్నారు.


## కేంద్ర సహాయ మంత్రిని కలిసిన ఆర్‌పిఐ నాయకులు

ప్రజాశక్తి - ముదినేపల్లి



బొకే అందజేస్తున్న నాయకులు

రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా అధ్యక్షులు, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామదాస్ అథ్వాలేను మండలానికి చెందిన పలువురు ఆర్‌పిఐ నాయకులు శుక్రవారం కలిశారు. గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర సహాయ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కేంద్ర సహాయశాఖ మంత్రి రామదాస్ అథ్వాలేను కలిసిన ఆర్‌పిఐ నాయకుల్లో దాకరపు శ్రీనివాసరావు, ఇంటేటి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.



నూతన కమిటీ

## టిడిపి నూతన కమిటీ ఎన్నిక

**ఆగిరిపల్లి:** టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నక్కనబోయిన వేణు(శోభనాపురం), కొల్లిపర సాంబశివరావు(కలటూరు)లు ఎన్నికైయ్యారు. టిడిపి మండల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఆగిరిపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా ఆరేపల్లి శివయ్య(ఈదులగూడెం), కోశాధికారిగా యండూరు ప్రణీత్(ఆగిరిపల్లి), కార్యనిర్వాహక కార్యదర్శులుగా కోసూరి సుబ్బరాజు(సూరవరం), లోకం సత్యనారాయణ(చొప్పరమెట్ల), బోనం శ్రీనివాసరావు(ఆగిరిపల్లి), కార్యదర్శులుగా షేక్ ఛాన్‌భాషా(ఆగిరిపల్లి), గంపా గోపి(వడ్లమాను), నల్లమోతు బుల్లిబాబు(కనసానపల్లి)లు ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో టిడిపి బలోపేతానికి పాటుపడతామన్నారు.

# దోమలు విపరీతంగా పెరిగిపోయాయ్

## దీపం పథకం, తల్లికి వందనం డబ్బులు పడలేదు

## 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎంఎల్ఎ బడేటి వద్ద మొరపెట్టుకున్న స్థానికులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, దోమల మందు కొట్టించాలని, దీపం పథకం డబ్బులు పడలేదని, తల్లికి వందనం రాలేదని ప్రజలు ఎంఎల్ఎ బడేటి చంటి వద్ద వాపోయారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శుక్రవారం మూడోరోజు స్థానిక 49వ డివిజన్‌లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పలువురు దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, తల్లికి వందనం పడలేదని మొరపెట్టుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్య నెరవేరుస్తానని చంటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి** : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే సూపర్ సిక్స్ పథకాల అమలులో పురోగతిని సాధించి అన్ని తరగతుల ప్రజల మన్ననలు పొందిందని టిడిపి మండల అధ్యక్షులు నక్కనబోయిన వేణు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని శోభనాపురం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు డి.సాయిరాం, కార్యదర్శి పి.ఆంజనేయులు, నీటిసంఘం ఛైర్మన్ యు.వెంకటేశ్వరావు, ఎన్.హరిబాబు, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం** : జంగారెడ్డిగూడెం పట్టణంలోని 31, 32, 33, 44, 45, 47, 48 వార్డుల్లో 'సూపరిపాలనలో తొలి అడుగు' ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, సీనియర్ నాయకులు చెరుకూరి శ్రీధర్, అల్లూరి రామకృష్ణ, అల్లూరి శేఖర్, పాలూరి లక్ష్మణరావు, చిత్తపురి దుర్గేష్, జంగా ప్రసాద్ రెడ్డి, గెడా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

**ముసునూరు** : సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వేలుపుచర్లలోని ఆరు ఎకరాల కొండ పోరంబోకు భూమిని ఇండ్ల స్థలాలకు అధికారులు, కూటమి నాయకులతో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. ఆరు ఎకరాల భూమిని సర్వే చేసి, చదును చేసి ఇండ్ల స్థలాలకు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, గరికిముక్కు నాని, తుమ్మల నాగేశ్వరరావు, మానం వంశీ పాల్గొన్నారు.

**పోలవరం** : రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్, పోలవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం డోర్ టూ డోర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కుంచె దొరబాబు, మంగిన కొండబాబు, బాదం ప్రసాద్, పోతుల శ్రీనివాసరావు, పిల్లి నాగరాజు పాల్గొన్నారు.

**కలిదిండి** : 1వ వార్డులో టిడిపి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కైకలూరు నియోజకవర్గ పరిశీలకులు మెంటే పార్థసారథి, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి పాల్గొన్నారు.

## బడుగు బలహీన తరగతుల ఆశాజ్యోతి రంగా

**ముదినేపల్లి** : బడుగు, బలహీన తరగతుల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. వంగవీటి మోహన రంగా 78వ జయంతి సందర్భంగా రంగా విగ్రహానికి రామిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణు వర్ధన్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ నివాళులర్పించారు.

**ఏలూరు సిటీ** : ఏలూరులోని సర్ సిఆర్ రెడ్డి కళాశాల వద్ద కాపు బలిజ సంక్షేమ శాఖ జిల్లా అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంగవీటి మోహన్ రంగ 78వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ ఎపిఎస్ ఆర్‌టిసి రీజినల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు. పేదవారికి దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు నాగం శివ పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం** : మండలంలోని దిప్పకాయలపాడు గ్రామంలో కేక్ కట్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు తోట రవి, మండల ఉపాధ్యక్షులు సత్తిరాజు పాల్గొన్నారు.

**ముసునూరు:** మండలంలోని ముసునూరు గ్రామంలో వంగవీటి మోహన రంగా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కోనేరు విజయ భాస్కర్, కోనేరు సాయికృష్ణ, కొల్లి పోతురాజు, నందేటి సత్తి పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్** : రాధా రంగా మిత్రమండలి నేత మలిశెట్టి బాబి ఆధ్వర్యాన నూజివీడు పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా రోశయ్య జయంతి

**కొయ్యలగూడెం** : పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు కొనిజేటి రోశయ్య 92వ జయంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాటూరు సుధీర్ పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం యావత్ ఆర్యవైశ్య జాతి ఆనందించాల్సిన విషయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కంభంపాటి సాయికృష్ణ, కోశాధికారి మోటమర్రి ఉమామహేశ్వరరావు, ఆలయ ఛైర్మన్ బొమ్మాబాబు, చిరావూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వికసిత్ స్వచ్ఛంధ్రా విజన్-2047పై సమీక్ష

**బుట్టాయగూడెం** : కెఆర్.పురం ఐటిడిఎలో పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల అధికారులతో వికసిత్ స్వచ్ఛంధ్రా విజన్-2047పై పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 7 మండలాల అభివృద్ధిపై చర్చించారు. వీటిలో మండలాల సమస్యలు, పరిష్కారాలు స్థానిక అవసరాలకు ప్రణాళిక ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఉపాధికి సంబంధించి అవకాశాలు వచ్చేలా అంశాలను పొందుపరచాలన్నారు. ప్రధానంగా వ్యవసాయానికి సమబంధించి పంటల సమస్యలు, వీటికి సైన్స్ ల్యాబులు నిర్మించి రైతులను తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చేలా శిక్షణ, ప్రొడక్షన్ ఇచ్చే విధంగా ముందుకు సాగాలని, చేనేత పనులు అభివృద్ధి చేయాలన్నారు. 7 మండలాల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

**కొయ్యలగూడెం** : పరింపూడి ఎంపిపి పాఠశాలలో ఈనెల 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న బడి వైపు ఒక అడుగు పాఠశాల బాలబాలికల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంఖ్యను పెంచడం, విద్యా నాణ్యతను మెరుగుపరచడం ఈ డ్రైవ్ లక్ష్యం. స్థానిక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా సమావేశంలో చురుకుగా పాల్గొని, విద్యార్థుల భవిష్యత్తు కోసం చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎంఇఒ, ఇఒపిఆర్‌డి, అధికారులు పాల్గొన్నారు.

**కలిదిండి** : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పేలా ప్రధానోపాధ్యాయులు దృష్టిసారించాలని ఎంఇఒ వెలమల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నేను బడికి పోతాను కార్యక్రమంపై సమావేశం జరిగింది. 14 ఏళ్ల లోపు పిల్లలను బడిలో చేర్పించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. క్లస్టర్ హెచ్‌ఎంలు స్వర్ణ కుమారి, సునీలా జ్యోతి, వరప్రసాద్, చెన్ను శ్రీనివాసరావు, మండల పరిధిలోని సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## నేడు 'చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

**కొయ్యలగూడెం** : మండలంలోని అంకాలగూడెం గ్రామంలోని సురేష్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వైసిపి ఆధ్వర్యాన 'చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు కోటగిరి శ్రీధర్, కారుమూరి సునీల్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఎస్‌సి సెల్, మైనారిటీ సెల్, బిసి సెల్ నాయకులు, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు పాల్గొననున్నారు.